నవల

# వికర్ణ



డా. చింతకింది శ్రీనివాసరావు

# వికర్ణ

డాక్టర్ చింతకింది శ్రీనివాసరావు

శ్రీనిజ
ప్రచురణలు

విశాఖపట్నం
2015

# VIKARNA

By Dr. CHINTAKINDI SRINIVASA RAO

© Writer

| | | |
|---|---|---|
| Cover Design | : | Kalyan Chakravarthy .K<br>Visakhapatnam @9985236050 |
| First Edition | : | 2015 |
| For Copies | : | ✦ At all Leading Book Stores<br>✦ Srinija Prachuranalu<br>6-60/1, Ravindranagar, Old Dairy Farm,<br>Visakhapatnam - 40<br>Cell : 88971 47067<br>e-mail : chsr005@gmail.com |
| Printed at | : | Charitha Impressions,<br>Ajamabad Industrial Area,<br>Hyderabad, India, Ph :040- 276678411 |
| e Book | : | www.kinige.com |
| Price | : | Rs. 110/- |

# అంకితం





నా అక్షరాలను ప్రేమిస్తూ ..

నన్ను ప్రోత్సహించే..

సోదరతుల్యులు

పరుచూరి భాస్కరరావు, వై.వి. హరికృష్ణ సాయిలకు

# మరో మర్యాదా పురుషోత్తముడు..

**డా**క్టర్ చింతకింది శ్రీనివాసరావు వృత్తిరీత్యా సీనియర్  పాత్రికేయులు, ఇప్పుడు సంపాదకులు. ప్రవృత్తి రీత్యా సాహిత్యపిపాసి, అధ్యయనశీలి. ఆయన సాహితీస్వరం వ్యక్తిత్వ ప్రతిభా భాస్వరం! సంస్కృతీ సంస్కార ప్రతిఫలనంగా అనర్గళంగా మ్రోగుతుంది ఆయన గళం!

పత్రికల్లో వ్యాఖ్యలూ, వ్యాఖ్యానాలూ (ఆ పరిభాషలో– రిపోర్ట్‌లూ, స్టోరీలూ) రాయడం ఒక అనివార్య జీవి(క) హేల! లౌకిక జీవనలీల!

ఉత్తమ సాహిత్య సృజన వేరు. ముందటి వాటికి కాస్తంత లౌకికపు చదువూ, భుజబలం, వక్రోక్తి, ప్రజ్ఞా వంటి పదార్థాలు వుంటే చాలు. రెండవదానికి మేధకావాలి. దీని అర్థం వేరు. పరమార్థమూ వేరే. ఇదిగో ఇక్కడా 'తీరని దాహం'తో తపించే సాహిత్యకారుని అసలైన సృజన'సత్తా' వెలికవచ్చేది. శ్రీనివాసరావులోని ఈ 'సత్తా' 'వికర్ణ' నవలగా రూపెత్తింది.

'వికర్ణ' ఒక చారిత్రక అవసరాన్ని తీరుస్తూ వచ్చింది.  ఈ నాటి సామాజిక అస్తవ్యస్థ వ్యవస్థా సందర్భంలో – మహిళల పట్ల జరుగుతున్న దౌష్ట్యాన్ని, దుర్మార్గపు దాడిని ఎదుర్కొని, తప్పుని తప్పుగా నిరసించి, తిరస్కరించి, సరిదిద్దే – సద్భావననీ, సదాచరణనీ నేటి యువతరంలో ప్రోది చేయటానికి తన రచన చోదకశక్తి కావాలని ఈ మహోత్తరమైన నవలని రాశారు శ్రీనివాసరావు. ఆయనలోని 'జీవునివేదన' పాఠకులలోనికి ప్రవహించి, ఆయన  శుభకాంక్ష సఫలమయ్యే సూచనలు ఇప్పటికే సాహితీలోకానికి అందేయి. ఇదొక వాంఛిత విజయం!

మహాభారతంలో వికర్ణుడు చాలా చిన్నవాడు. కర్ణుని మాటల్లో ‘చిరుతవాడు’. అలాంటి వాడు పాంచాలీ పరాభవఘట్టంలో చిత్తశుద్ధితో, లక్ష్యనిర్దేశంతో, యౌవనోత్తేజంతో ధర్మాధర్మ విచక్షణని గణగణమనిపించాడు. అది కూడా కురువృద్ధుల్, గురువృద్ధ బాంధవులనేకుల్ చూచుచుండగ.. సభలో చర్చకు పెట్టాడు. తాను కేవలం ధర్మ పక్షపాతినని ఒంటరిగా– ఎక్కటిపోరుకు సిద్ధపడతాడు. వికర్ణుడు – అలా ఒక మహిళ (ద్రౌపది) పట్ల జరుగుతున్న దారుణాన్ని ఖండించే తీరుకి ఎందరో లోలోపల హర్షించారు. అయితే, స్వామి భక్తి పరాయణుడుగా కర్ణుడు – ఆ ధర్మ పన్నాల్ని ‘వృద్ధజనములున్న చోట తరుసంటి పలుకులు’ అని ఈ సడిస్తాడు! అయినా వికర్ణుడు కుండబద్దలు కొట్టిమరీ వస్త్రాపహరణాన్ని దుయ్యబట్టాడు.

ఇదిగో, ఈ ఘట్టం శ్రీనివాసరావు మనసుకు పట్టింది. సామాజికబాధ్యతా, సాహిత్యారాధనా, మానవతాకర్తవ్యం– ముందుకు నడిపాయి. ఆ సభాపర్వసన్నివేశంలో యువ వికర్ణుని చిత్తదారుఢ్యం, వర్తన నైర్మల్యం, ధర్మ నిబద్ధతా – ఈయన మనసుని మెలిపెట్టాయి. బుద్ధిని రాపాడాయి. ‘నాటి వికర్ణుని వలె నేటి వారునూ’ ధర్మాచరణ పట్ల జాగరూకతనీ శ్రద్ధాభక్తుల్ని పెంపొందించుకోవాలని ప్రబోధాన్ని యివ్వాలనుకున్నారు. ఇచ్చారు!

సహజంగానే ‘వికర్ణ’ నవల ఇతివృత్తం– ఆ పాత్ర చుట్టూ తిరుగుతుంది. ఆయన జన్మవృత్తాంతం మొదలు ‘మహాభినిష్క్రమణం’ వరకూ – వివిధ సమయ పరిచ్ఛేదాల్లో వికర్ణుని వృత్తి ప్రవృత్తుల వింగడింపుని అద్భుతంగా ఆవిష్కరించారు రచయిత. కథాగమన చోదకంగానూ, ప్రసక్తానుప్రసక్తంగానూ, పాత్రచిత్రణ ప్రేరకంగానూ – మహాభారత ఘట్టాలు చాలా వస్తాయి. ధీరగంభీరమైన వికర్ణపాత్రని పరిపుష్టం చేయటానికి ఎడనెడ కల్పనల్ని జోడించారు శ్రీనివాసరావు. ఒక్క ముఖ్యవిషయం.. ఈ కల్పనల్లో రచయిత – కావ్య సంభావ్యతనీ, సమయజ్ఞతనీ, ఉచితజ్ఞతనీ, మీదు మిక్కిలి విజ్ఞతనీ పాటించారు. గాంధారీ పుత్ర సంతతి – నూర్గురిలో తానూ ఒక్కడే అయినా, వికర్ణుడు తన భిన్నత్వాన్ని పిండదశలోనే ఎలా వ్యక్తం చేశాడో చూపారు రచయిత. అలాగే కుమారాస్త్రవిద్యా ప్రదర్శనం నుంచీ ప్రతిఘట్టంలోనూ వికర్ణపాత్ర విలక్షణతనీ, ధర్మజ్ఞతనీ, వ్యక్తిత్వశోభనీ – తన ఊహాపోహలతో వేదికలకెక్కించి మూర్తిమంతం చేశారు శ్రీనివాసరావు.

ఆయన ఎంతో చదివి కొంచెం రాశారనే వాస్తవం సాహిత్య సంప్రదాయాల ఎరుకగల వారికి తెలుస్తుంది. వికర్ణ నవలా రచన ఒక కఠోర పరిశ్రమ. పరిశోధన! ఆ శ్రమని తాను ఆనందంగా స్వీకరించి, ఫలితాంశాన్ని చదువరులకు అందించారు శ్రీనివాసరావు. అందుకు ఆయన అన్ని కైమోడ్పులకూ అర్హులు!

ఇక, నవలాకథనం నిరాడంబరంగా సెలయేటిజాలులా సాగిపోయింది. ఆ కథనంలో రెండు అసాధారణ గుణవిశేషాల్ని మీతో ప్రస్తావించాలి. ఒకటి కథా నేపథ్యంలో సందర్భాన్నీ, సంఘటననీ మిళితం చేస్తూ ప్రస్తుత సన్నివేశాన్ని చదువరి కళ్లముందు నిలిపే దృశ్య చిత్రీకరణ. ఇది డాక్యుమెంటరీ టెక్నిక్‌లోని 'క్వాలిటీ'లో 'సూపర్ క్వాలిటీ'! దీన్ని శ్రీనివాసరావు ఎంతో నైపుణ్యంతో మెళకువతో నిర్వహించి, తనదైన నవలా సంవిధాన ముద్రని సాధించుకున్నారు. రెండవ అంశం - శైలి. 'శ్రీనివాసరావు శైలీ మాధుర్యం ఆయన అక్షర రమ్యతలో వుంది. అభివ్యక్తి సాంద్రతలో వున్నది. పదునుదేరిన వాక్య నిర్మాణంలో వున్నది. ఎలా అంటే? మూడు నాలుగు పదాలను కూర్చుకున్న చిన్న వాక్యం మన అంతఃకరణని పట్టిలాగుతుంది. బాలవికర్ణుడు తల్లిముందు అన్న అన్యాయం గురించి చెప్పిన ఘట్టం చదవండి.

"గాంధారీ దేవికి ఏమీ పాలు పోదు. జ్యేష్ఠకుమారుని చేష్టలను సమర్థించలేదు. అలాగని వికర్ణుని ముందు సుయోధనుని తక్కువ చేసి మాట్లాడలేదు.."

అలాగే, 'తప్పిన శిక్ష' అధ్యాయంలో కర్ణసుయోధనుల చర్చని చదవండి. ఉదాహరించవలసిన నవలాశిల్పవిశేషాలు చాలా ఉన్నాయి. గమనిస్తూ, గమనం (పఠనం) సాగించండి. 'వికర్ణ' నవల ఒక సత్‌హృదయ రచయిత ఆర్తి. ఈ జాతి మహిళల గౌరవ పరిరక్షణకు చేకొనవలసిన ఒక సదాశయదీప్తి! ప్రతి మనిషీ **internalise** చేసుకు తీరవలసిన ఒక తేజఃస్ఫూర్తి. జాతినాడిలో ప్రవహింపవలసిన సామాజికవసర విద్యుచ్ఛక్తి! అంతేకాదు. 'వికర్ణ' నవల ఒక పురాణ పాత్రకి దుష్టమైన, భ్రష్టమైన పునర్మూల్యాంకనం' కాదు.

అది వర్తమాన సమాజానికి ఆనాటి ఒక ధర్మపరుని 'రోల్‌మోడల్'గా పునర్నిర్వచించిన సాహితీ వైజయంతిక ! ఇదీ ఈ నవలా రచన అంతస్సారం! చూడండి. ముఖమూ అద్దమూ ఉన్నాయి. ఆలోచించండి. ఆచరించండి. సాహిత్యరూపశిల్పి శ్రీనివాసరావుని అభినందించండి. నేను మనస్ఫూర్తిగా అదే చేస్తున్నాను.

ప్రయోగశీలంతో, లక్ష్యశుద్ధితో ఆయన రాయనున్న, రానున్న రచనా పరంపరకి హృదయ పూర్వక శుభాకాంక్షలు పలుకుతున్నాను. జయోస్తు!

**– విహారి**

# ఎందుకు రాశానంటే..

**మా**మూలుగా అయితే నేను కథకుణ్ణి. కళింగాంధ్ర యాస, భాషల్లో కథలు రాస్తుంటాను. ఇంతకుముందెప్పుడూ నేను నవల రాయలేదు. ఈ వికర్ణే ఓంప్రదం. ఇది రాయడానికీ కారణం ఉంది.

నానాటికీ మన దేశంలో ఆడకూతుళ్ల మీద అత్యాచారాలు పెరిగిపోతున్నాయనేది అందరికీ తెలిసిన సంగతే. ఘనత వహించిన భారత రాజధాని ఢిల్లీలోనే నిర్భయ అనే అమ్మాయిని రేప్ చేసి చంపేశారు. దీనిపై అప్పట్లో యువతరం గొప్ప ఆందోళన చేసింది. హస్తినను హడలెత్తించింది. ఇంత జరిగినా ఈ మానభంగాలు ఆగలేదు. పైగా పెరిగాయి కూడాను.

అక్కడా ఇక్కడా అని లేదు. వారూ వీరూ అని తేడాలేదు. ప్రతీ వీధిలోనూ, వాడలోనూ, కోటలోనూ, పేటలోనూ స్త్రీలమీద దాడులు దారుణంగా సాగిపోతున్నాయి. వీటన్నింటిని గురించి బాగా ఆలోచిస్తున్నప్పుడే, మహాభారతంలోని వికర్ణుని ఘట్టం గుర్తుకువచ్చేది. ద్రౌపది చీర వొలిచేయాలని తలచిన దుర్యోధనునికి వికర్ణుడే అడ్డుతగలడం ఆశ్చర్యమనిపించింది. ఎందుకంటే, వీళ్లిద్దరూ గాంధారీ సుతులు. ఏకోదరులు. అప్పుడనిపించింది. అప్పటి భారతంలో ఒక వికర్ణుడున్నాడుగానీ, ఇప్పటి భారతావనిలో వీధికో వికర్ణుడుంటేనేగానీ కాంతల కష్టాలు తీరబోవని.

అలా వికర్ణుడు నా మటుకు నాకు హీరో అయిపోయాడు. నా బుర్రలో తిరగడం మొదలెట్టాడు. ఈ వికర్ణ సొదను ఎవరితో చెప్పుకోవాలనే యోచన వచ్చినప్పుడు సద్గురువులు శ్రీ శివానంద మూర్తిగారికి విన్నవించాలని అనిపించింది. వెనువెంటనే భీమునిపట్నం ఆనందవనానికి వెళ్లాను. విషయమంతా ఏకరవు పెట్టాను. ఆయన అంతా విన్నారు. ఒకే ఒక మాట చెప్పారు. "వికర్ణునికి అంతఃపురం ఎలా బతకాలో నేర్పలేదు. ఎలా బతక్కూడదో మాత్రం నేర్పించింది." అన్నారు. "ఇది చేయవలసిన రచనే. జయోస్తు." అనీ దీవించారు. వెయ్యేనుగుల బలం వచ్చినట్టయింది.

రాతకు అవసరమయ్యే అంతఃసూత్రమేదో ఆయన అందించినట్టయింది. అప్పుడు తట్టింది. భారతీయ సాహిత్యంలోని పురాణాలను పునఃకథనం చేసే ప్రక్రియ. అప్పుడిక వికర్ణునికి సంబంధించి భారతంలో దొరికిన నిజాలను ఆధారంగా చేసుకుని కాల్పనికతను జోడిస్తూ రాసుకుంటూ వెళ్లాను. వికర్ణుడంతటి నిజాయితీపరుడు బాల్యంలో ఎలా ఉండి ఉంటాడు. కాస్త పెద్దయ్యాక మరెలా ఉంటాడు. ఇంకాస్త పెరిగాక ఇంకెలా ఉంటాడు.. వంటి అంశాలను నాలో నేనే తర్కించుకున్నాను. ఆ రకంగా ఈ పుస్తకానికో రూపం వచ్చింది. ఇక్కడే మరో సంగతీ చెప్పాలి. భారతాన్ని సమర్థించడానికో లేక వ్యతిరేకించడానికో నేనీ రచన చేయలేదు. అప్పటి ధర్మాలు, రాజధర్మాలు వంటి వాటి మీద నేనేం అథారిటీని కాను. మహిళల గౌరవమర్యాదలు పెరగడం, వారి విషయంలో సానుకూలంగా వ్యవహరించే వికర్ణుల సంఖ్య అధికం కావడం వంటివి మాత్రమే ప్రస్తుత సమాజాన్ని రక్షించగలవనేది నా నమ్మకం.

ఈ నవలకు సంబంధించి ప్రధానంగా నేను ధన్యవాదాలు తెలియజేసుకోవాల్సింది ఆంధ్రభూమి దినపత్రిక సంపాదకులు శ్రీ ఎం.వి.ఆర్. శాస్త్రిగారికి. పంపిన వెంటనే పత్రిక సండే మేగజైన్‌లో ధారవాహికగా దీనిని ప్రచురించారు. పాఠకుల దీవెనలు దక్కేలా చేశారు. వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు. కలిసింది ఒక్కసారే. విహారిగారూ.. నా వికర్ణునికి ముందుమాట రాసిపెట్టండని అడిగాను. వెనువెంటనే రాసిచ్చారు. అంతటి పెద్దల రుణం తీర్చుకోలేనేమో. వారికి నమోవాకాలు. వికర్ణ రచనా కాలంలో ఆలంబనగా నిలిచిన శ్రీయుతులు ఆనంద్ ఖారా, పేరి రవికుమార్, రామతీర్థ, జగద్ధాత్రి, పూర్వ శాసనసభ్యులు కురసాల కన్నబాబు, మొగ్గ సీతారామయ్య, వి.ఎస్. ఆనంద్, గోపరాజు నారాయణరావు, మధునామూర్తి, యర్రా నాగేశ్వరరావు, విజయభాను చంద్రశేఖర్ వంటి ప్రియమితులందరికీ నమస్కారాలు.

ఈ వికర్ణ వల్ల మహిళల మనుగడ విషయమై మన సమాజాన ఏ మాత్రం సున్నితత్వం పెరిగినా నేను ధన్యుణ్ణే..

ఉంటాను.

మీ..

**– చింతకింది శ్రీనివాసరావు**

# వికర్ణ

అది మాఘమాసం. శుక్లపక్షం. భీష్మ పితామహుడు ఉత్తరాయణ పుణ్యకాలం కోసం వేయి కళ్లతో నిరీక్షిస్తున్న కాలం. ఆ మహావీరుడు అంపశయ్యమీద అరమోడ్పు కన్నులతో పరుండిఉన్నాడు. హృదయాన్ని శివైక్యం చేసేందుకు సిద్ధపడుతున్నాడు. దేహమంతా నెత్తుటిచారికలే. ఒడలంతా శరాఘాతాల జాడలే. బాణాల పాన్పు భీష్మాచార్యుని శరీరాన్ని గుచ్చెత్తి నిలిపింది. ఆ యాతన చెప్పలేనిది. ఆ బాధ వివరించజాలనిది. అయినా పితామహులవారిలో ఆ నరకయాతనల ఛాయలేవీ గోచరమవ్వడం లేదు. మీదుమిక్కిలిగా, ఆయన వదనం ప్రశాంతంగా కానవస్తోంది. శరత్పూర్ణిమలా చల్లగా, తేజోమయంగా ప్రకాశిస్తోంది.

అతడు అనేక యుద్ధాలలో ఆరితేరిన మహామూర్తి. ఈ ప్రపంచంతో తనకేమీ సంబంధం లేనట్టుగా నిశ్చలుడై ఉన్నాడు. నిష్కామకర్మయోగియై పరలోకప్రయాణం కోసం ఎదురుచూస్తున్నాడు.

సరిగ్గా ఇదే సమయంలో తాతగారి దర్శనం చేసుకోవాలనుకున్నారు పాండుసుతులు. వెన్నంటికాచే కృష్ణ పరమాత్మునితో ఈ మాటే చెప్పారు. గుండెల్లో గూడుకట్టుకున్న కొన్ని భావాలనూ పంచుకున్నారు.

“నందనందనా. కురుక్షేత్ర సంగ్రామం పూర్తయింది. మాకు దన్నుగా నిలిచావు. విజయలక్ష్మిని ప్రాప్తింపజేశావు. అరివీరభయంకరమైన కురుసేనావాహినిని తుత్తునియలు చేసేలా అర్జునునికి సాయపడ్డావు. సారథివయ్యావు. ఇంత జరిగినా ఎందుకనో విజయగర్వమేమీ మదిలో మెదలడం లేదు. అయినవారిని చంపుకున్న తర్వాత రాజ్యం ఉండినా మండినా ఒక్కటి కాదా.” ధర్మరాజు నిర్లిప్తంగా అనేసరికి, నల్లనయ్య మనసు కించిత్ వ్యాకులతకు లోనయింది. దాన్ని పైకి కనిపించనివ్వకుండా జాగ్రత్తపడ్డాడు.

గెలిచిన సందర్భంలోనూ పాండవాగ్రజుడు నైరాశ్యానికి గురవుతుండటం గోవిందునికి ఎంత మాత్రమూ నచ్చలేదు. చక్రవర్తిగా సువిశాల భారతావనికి సుపరిపాలన అందివ్వవలసిన ధర్మజుడు బేలగా మారడం మింగుడుపడలేదు. అందుకే అందుకున్నాడు.

"బావా. ఇది ఆలోచనకు సమయం కాదు. ఇది పూర్వవిచారణలకు, గత జలసేతుబంధనలకూ తరుణమూ కాదు. ఇప్పుడు మీ ముందున్నది అమాయక ప్రజలు. వారి భవిత. యుద్ధం కారణంగా దేశమంతా కకావికలమైంది. మీ కర్తవ్యం జనంలో విశ్వాసాన్ని ప్రోదిచేయడం. వారిని కర్తవ్యోన్ముఖులుగా దిద్దితీర్చడం. ఇది గొప్ప బాధ్యత. ప్రభువుగా నీ భుజస్కంధాల మీద ఉంది. నీవు ఆ బాధ్యతను విస్మరించజాలవు. మీరంతా తెలుసుకోవాల్సింది పాలనకు సంబంధించిన ప్రామాణికమైన అంశాలు. రాజధర్మాలు. రాజ్యఉద్ధరణ విషయాలు. స్ఫూర్తిదాయకమైన చరితలు.. గాంగేయుడే ఈ సంగతులన్నింటినీ విశదం చేయగలడు. ఆయనను కలవడమే శ్రేయస్కరం." కుంతీపుత్రులకు ప్రేమపూర్వకంగా తెలియజేశాడు.

అపరాధభావనలేవో దహించివేస్తుండగా తల్లడిల్లుతున్న ధర్మజుని హృదయం దేవకీనందనుని మాటలతో కొంత సాంత్వనకు నోచుకుంది. అయినా క్రూరమైన యుద్ధాన్ని తలకెత్తుకున్నామన్న ఆలోచన మాత్రం వెన్నాడుతూనే ఉంది. సోదరులు వెంటరాగా తలవంచుకుని భారంగా శిబిరం నుంచి వెలుపలికి వచ్చాడు. నడక మొదలెట్టాడు. భీమార్జున నకులసహదేవులు మౌనంగా అనుసరించారు. అందరికంటే ముందు దారి చూపుతున్నట్టుగా అడుగులు వేశాడు కృష్ణపరమాత్మ. యుద్ధం జాడలు భీకరంగా వారి బాటలో దృగ్గోచరమయ్యాయి.

తెగిపడిన తలలు. విరిగిపడ్డ కృపాణాలు. నక్కలు తినివదిలేసిన కళేబరాలు. జారిపడ్డ కిరీటాలు. మన్నులో ఇంకిపోయిన నెత్తురు. యుద్ధభూమి కాదది. శ్మశానస్థలి. మానవ మహాకాంక్షకు, కార్పణ్యానికీ, వ్యూహ ప్రతివ్యూహాలకు వేదిక. రాజ్యాన్ని సాధించేందుకు జరిగిన రక్తతర్పణల భయంకరహేల.

ముక్కుపుటాలు అదిరిపోయేంత దుర్గంధం ఆ నేలమీదినుంచి నలుదిశలకూ పరివ్యాప్తమవుతోంది. పిండారబోసినట్టుండే వెన్నెల సైతం ఆ సమరసీమ మీద పడి తానేదో అవమానానికి గురయినట్టుగా చిన్నబోతోంది. మృతదేహాలపై, విరిగిన రథాలపై, తెగినకాయాలపై దూకిన చంద్రకాంతి వక్రీభవనం చెంది వింత వింత కిరణాలుగా రూపుమార్చుకుంటోంది.

పిల్లతెమ్మెరలు ఆ నేలపైకి దూసుకువచ్చి రథాల కేతనాలను రెపరెపలాడించడం లేదు. తేరుల చుట్టూ కట్టిన చిరుగంటలను మ్రోయించి మృత్యుగంటానాదాలను వినిపిస్తున్నాయి.

పాదయాత్రికులై సాగిపోతున్న పాండవులకు మాత్రం ఇవేమీ పట్టడం లేదు. దారితప్పిపోయిన గొర్రెపిల్లల్లా వెళుతున్నారు. కృష్ణపరమాత్మ ఎటు మలుపు తిరిగితే అటే తిరుగుతున్నారు. కొంతసేపటికి వారందరి పాదాలు ఒక చోటుకు వచ్చేసరికి ఆగిపోయాయి.

అదీ రణభూమిలో భాగమైన ఒకానొక స్థలమే. కానీ, ఆ ఆనవాళ్లేవీ పెద్దగా కనబడటం లేదు. సరిగ్గా అక్కడే అర్జునుడు భీష్మాచార్యునిపై బాణాలతో దాడిచేసింది. శిఖండిని అడ్డుపెట్టుకుని కురువృద్ధునిమీద శరసంధానం చేసింది. ఆయన ధనుస్సును ఖండించింది. ఆయన తూణీరాన్ని ముక్కలు చేసింది. ఆఖరికి ఆయన గుండెల్లో బాణాన్ని దించింది. అమ్ములపడకను కానుకగా చేసింది. భూమాత గుండెల్లోకి అస్త్రాన్ని పంపి దివ్యజలాలను పైకి తెచ్చి పితామహుని గొంతు తడిపింది.

ఆ ప్రాంతాన్ని చూడగానే అర్జునుడు సజలనేత్రుడైపోయాడు. దుఃఖం పొంగుకు రాగా భీష్ముని చెంతకు చేరాడు. మహావీరుడు పాండవమధ్యముడే అంతులేని రోదన పాలబడ్డాక మిగిలిన వారి సంగతి చెప్పేదేముంటుంది. అందరూ విలపిస్తూ అంపశయ్యవైపుగా అడుగులువేశారు. సకల కశ్మలాన్నీ హరించేది గంగామాత. ఆమె తనయుడు భీష్ముడు. అందుకే, ఆయన ఉన్న చోటు రుద్రభూమి అయినా, సమరభూమి అయినా పచ్చాపచ్చని ప్రదేశమై అలరారుతుందని వారికి ఇట్టే బోధపడింది.

దుఃఖం. ఒకటే దుఃఖం. కన్నులన్నీ కారుమబ్బులై వర్షిస్తున్న సమయం. రాజ్యం వీరభోజ్యం.. బలవంతునిదే సామ్రాజ్యం.. వినడానికి ఈ మాటలు బాగానే ఉండవచ్చు. రాచబిడ్డలకు ఈ సిద్ధాంతాలను గురువులు ఉగ్గుపాలతో రంగరించి పోయనూవచ్చు. కానీ, పోరాటంలో ఓడేవాడు మనిషి. ఓడించేవాడూ మనిషే. మనిషి అనగానే ఎక్కడో ఒక మూల మానవత ఉండకపోదు. అది ఏదో ఒక క్షణాన బహిర్గతం కాకనూపోదు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Vikarna**

* * *